

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,29 జులై 2025

8 పేజీలు


### తిరుపతి జిల్లాను పర్యాటకంగా

## అభివృద్ధి చేస్తాం

-రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



**తిరుమల,మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని, రాబోయే రోజుల్లో తిరుపతి పరిసర క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. సోమవారం తెల్లవారుఝామున తన కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.కుటుంబంతో కలిసి వైకుంఠ శ్రీనివాసుడి దివ్యదర్శనం చేసుకోవడం అనిర్వచనీయమైన అనుభూతి కలిగించిందని, ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు బాగుండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని స్వామిని ప్రార్థించినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో పర్యాటక అభివృద్ధి కోసం ఆగస్టు 7,8 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే సమావేశంలో జిల్లాలోని అధికార యంత్రాంగం,పర్యాటక,దేవాదాయ శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు. తిరుపతి జిల్లాలోని వివిధ క్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలన్నింటిని కలిసి టూరిజం సర్క్యూట్ గా ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ శాస్కి పథకం క్రింద మంజూరైన గండికోట పర్యాటక ప్రాజెక్టు అభివృద్ధి పనులకు ఆగస్టు 1వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన చేయించాలని ఆలోచన చేస్తున్నామన్నారు. టూరిజం రంగానికి పారిశ్రామిక హోదాకల్పన, నూతనపాలసీ ప్రకటనతో తిరుపతి,

- తరువాయి 2లో..

### కూటమి పాలనలోనే

## రాష్ట్రాభివృద్ధి సాకారం

- సీఎం చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రం ప్రగతి పదం
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్






**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి సాకారం అవుతుందని, గత వైసిపి ఐదేళ్ల విధ్వంసాన్ని సరిచేసి రాష్ట్రాభివృద్ధిని సాకారం చేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌పేర్కొన్నారు. సోమవారం నెలపర్తి పాడు, బాపనయ్య చెరువు గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లిప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ఏ ఇంటికి వెళ్లినా, ఏగడప తట్టినా తల్లుల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుందని,గత ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలను చిన్నాభిన్నం చేశారని, పరదాల చాటున దాక్కునేది పాలన కాదని, ప్రజల్లోకి వచ్చి ప్రజల సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించేదే

- తరువాయి 2లో..

## అర్జీలకు సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలి

- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సకాలంలో క్రియాత్మకంగా నూటికి నూరు శాతం సంతృప్తి కొలమానంగా తగు పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా సుమారుగా 228 అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ప్రజల ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి వాటిని సంతృప్తికర స్థాయిలో సమర్థవంతంగా పరిష్కరిస్తూ పారదర్శకతకు పెద్దపీట

- తరువాయి 2లో..

## అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం అందివ్వాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం అందివ్వాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జేసీ రాహుల్ మీనా,జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాల రావు, సీపీవో పీ త్రినాథ్,బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, జీజీహెచ్ ఎస్డీసీ ఎన్.శ్రీధర్‌లతో కలిసి హాజరై, జిల్లా చుట్టుప్రక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలనుఆయాశాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, తల్లికి వందనం,ఉద్యోగఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు,

- తరువాయి 2లో..

## పేద కుటుంబాలను అధికారులు దత్తత తీసుకోవాలి

### - ఐటీడీఏ పిఓ కట్టా సింహాచలం



విలేకరుల సమావేశం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ,

**రంపచోడవరం, మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో బాగా పేదరికంతో ఉన్న కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఒక్కొక్క అధికారి ఒక్కొక్క కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన పి4 అనే ప్రోగ్రాం ద్వారా పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంపై

- తరువాయి 2లో..

## సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పరిపాలన

- ఎమ్మెల్యే రాజప్ప




**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వపాలన కొనసాగుతుందని, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సోమవారం పెద్దాపురం మండలం, జి.రాగంపేట గ్రామంలో గ్రామ టిడిపి అధ్యక్షులు మరియు వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ జల్దాని సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు దూసర్లపూడి యేసుబాబుల ఆధ్వర్యంలో సుపరిపాలన, తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూకూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, దీపం పథకం, అన్యాక్యాంటిన్‌లు పనురద్ధరణ, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు సంవత్సర కాలంలోనే నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మొయిళ్ళ

- తరువాయి 2లో..

# సౌకర్యాలు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



**– పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం**

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థుల సౌకర్యాలు భద్రత అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాష యాజమాన్యాలకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి ఫీజులు వసూలు విద్యార్థినీ విద్యార్థుల బస్సులలో రవాణా భద్రత స్థానికంగా పాఠ్య నోటు పుస్తకాలు నిర్దేశిత ధరలకు విక్రయించడం, బస్సులలో రహదారి భద్రత అంశాలలో సామాజిక బాధ్యత వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిఎస్ఓ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ విద్యను వ్యాపార కోణంలో కాకుండా సామాజిక సేవా దృక్పథంతో అభ్యసింపజేసే దిశగా యాజమాన్యాలు వ్యవహరించాలని సూచించారు. వినియోగదారుల ఫోరం, ప్రభుత్వం రెగ్యులేటరీ ఫీజులు బోర్డు విధివిధానాల మేరకు ఫీజులను వసూలు చేయాలని సూచించారు. విద్య హక్కు చట్ట ప్రకారం అన్ని పాఠశాలలకు ట్యూషన్ ఫీజు ఒకే విధంగా ఉంటుందన్నారు. ఫీజులు చెల్లించిన సందర్భంలో తప్పనిసరిగా రసీదులు సమర్పించాలన్నారు. విద్యా హక్కు చట్ట ప్రకారం ప్రైవేట్ యాజమాన్యాలు సీట్లు కేటాయిస్తూ పేద విద్యార్థులకూ నాణ్యమైన విద్యాబోధన చేపట్టాలన్నారు. సమాజంలో వివిధ రకాల ఫీజులు చెల్లింపు పుస్తకాల తదితర అంశాలలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన పెంచుకుని రక్షణ పొందాలన్నారు. ధరలలో వ్యత్యాసం వలన వినియోగదారులు నిలువునా మోసపోతున్నారని, ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటుగా వినియోగదారునికి నాణ్యమైన సేవలు అందుతాయని, ముఖ్యంగా వినియోగదారులు హక్కులతో పాటు భాధ్యతలు కూడా తెలుసుకుని అన్యాయాలను అవినీతిని ప్రశ్నించినప్పుడే వినియోగదారుల రక్షణ చట్టం ప్రయోజనాలు ప్రజలకు అందుతాయని తెలిపారు. ప్రతి వినియోగదారుడు ఫీజులు చెల్లింపు పుస్తకాలు కొనుగోలు కొనేటప్పుడు రసీదులను తీసుకోవాలని కోరారు. నష్టపోయిన వినియోగదారుడు, వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించి న్యాయం పొందాలన్నారు. పాఠ్య నోట్ పుస్తకాలు అమ్మకాలు నిర్దేశిత ధరలమేరకే బాలల హక్కు చట్ట ప్రకారం ఐజనిక్‌గా ఎన్విరాన్మెంటును తీర్చిదిద్దడంతోపాటు కారిడార్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ సర్వేలెన్స్ పెంచాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు భద్రతాపరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. విద్యా సంస్థ ఏర్పాటైన సందర్భంలో రూపొందించిన బైలాస్ నిబంధనలు, ఫీజు రెగ్యులేటరీ అథారిటీ ప్రకారం వసూలు చేస్తూ విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రధాన రహదారుల ప్రక్కనే ఉన్న విద్యాసంస్థలవారు సెక్యూరిటీ గార్డును తప్పనిసరిగా నియమించి రోజువారీగా రహదారి భద్రతా చర్యలను చేపట్టేలా చూడాలన్నారు. డిటిఓ డి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ యాజమాన్యాలు పూర్తి ఫిట్నెస్‌తో వాహనాలు నడపాలన్నారు. రహదారి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రైవర్ల బ్యాక్ గ్రౌండ్, క్రమశిక్షణ, మానసిక శారీరక స్థితి, ఆలోచన ధోరణి వంటి అంశాలను పరిగణనలో తీసుకుని బాధ్యతలు అప్పజెప్పాలన్నారు. బస్సులో ఉండే 50 మంది పిల్లల, ప్రాణాలు జీవితాలు డ్రైవర్ చేతిలోనే ఉంటాయని తెలిపారు. కళాశాలకు వెళ్లే పిల్లలు తప్పనిసరిగా లైసెన్సులు పొంది హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. రహదారి భద్రతపై ప్రతిఒక్కరూ ఫోకస్ పెట్టాలని, పాఠశాల యాజమా న్యాలు పట్ల విద్యార్థినీ విద్యార్థులకు భయం ఉంటుందని తల్లిదండ్రుల పట్ల భయం తక్కువగా ఉంటుందని, యాజమాన్యాలే విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు తీసుకొని రావాలని ఆయన సూచించారు. పేరెంట్స్ మీటింగ్ నిర్వ హించేటప్పుడు రహదారి నిబంధనల పట్ల అవగాహన పెంపొందిం చేందుకై తప్పనిసరిగా డిటిఓ ను ఆహ్వానించాలని ఆయన కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా అనుభవజ్ఞులైన టీచర్లను నియమిస్తూ ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలన్నారు. పదవ తరగతి ఉన్నత చదువులకు తొలిమెట్టని, విద్యా నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడరాదని స్పష్టం చేశారు. పాఠ్య, బుక్ పుస్తకాల విక్రయాలలో సామాజిక బాధ్యతతో లాభాపేక్ష లేకుండా విక్రయించాలని సూచించారు. వివిధ రకాల ఫీజులు వివరాలకు సంబంధించి పాఠశాల ప్రధాన ముఖ ద్వారం వద్ద ప్రదర్శన బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం 12 (1) సి ప్రకారం బ్యాంక్ ఖాతా ప్రారంభిస్తే ట్యూషన్ ఫీజు నిధులు జమ అవుతాయన్నారు.

## పేద కుటుంబాలను అధికారులు దత్తత తీసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

ఎపిఓ జనరల్ డి.ఎన్.వి.రమణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదవారు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా పి4 అనే కార్యక్రమం ద్వారా ప్రతి ఐఎఎస్ అధికారి ముందుగా ఒక్కొక్క కుటుంబాన్ని దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు నాటికి 20 శాతం మంది బాగా పేదరికంలో ఉన్నారని, వీరు అన్ని విధాల అభివృద్ధి చెందే విధంగా ఒక్కొక్క అధికారి, ఒక్కొక్క పాత్రికేయుడు ఒక్కొక్క కుటుంబాన్ని దత్తత తీసుకొని పేదరికంలో ఉన్నవారి జీవనశైలిని మార్పు వచ్చే విధంగా మనందరం కృషి చేయాలని ఆయన అన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులు అనేకమంది చాలా పేదరికంలో ఉన్నారని వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా మనమందరం కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి పి4 ప్రోగ్రాం ద్వారా పేదవారిని గుర్తించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఒక్కొక్క అధికారి ఒక్కొక్క కుటుంబాన్ని దత్తత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, ఏపీవో జనరల్ డి.ఎన్.వి.రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పరిపాలన

మొదటిపేజీ తరువాయి

కృష్ణమూర్తి, పలువురు కూటమి పాలన సంక్షేమంపై వివరించారు. టిడిపి నాయకులు మరియు ఎంపిటిసి పచ్చిపాల సతీష్, సైనం సాల్మన్‌రాజు, దేవళ్ళ వరప్రసాద్, దేవళ్ళ సతీష్, కొమ్మిరెడ్డి బుజ్జి, కొత్తెం కోటి, వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ రేలంగి వెంకట్రావు, నూనె రామారావు, గంద్రోతుల వెంకట్రావు, సాంబత్తుల వెంకటేష్, బైరెడ్డి చక్రరావు, మండిపూడి బుల్లిరాజు, (వార్డు మెంబర్) జల్లాని దుర్గ ఉమ మహేశ్వరి, సూరెడ్డి యేసుబాబు, లోల్ల వీరబాబు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీనికి ముందుగా ఎమ్మెల్యేరాజప్ప పలుఅభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ నిర్వహించి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు.సోమవార పిజిఆర్ఎస్ కార్యక్ర మమునకు 65 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పికి స్వయంగా తెలియచేసుకున్నా రు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించివారి సమస్యలనుఅడిగితెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలోను,సర్కిల్ కార్యాలయా లలోను, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవ చ్చునని,సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు

**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 8అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు.ఈఅర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓసంబంధిత అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో డిఎఇఓఈరంకి ప్రభాకర శర్మ, డివిఎల్‌పిఓ కార్యాలయ ఏఓ మైథిలి, ఎ.ఎస్.డబ్ల్యూఓ వాణి,హౌసింగ్ ఏఇరవిశంకర్,హెచ్‌డబ్ల్యూఓ శ్రీవల్లి, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

మొదటిపేజీ తరువాయి

వైజాగ్ ప్రాంతాల్లో పీపీపీ విధానంలో ఫైవ్‌స్టార్ హోటల్లు నెలకొల్పేందుకు పలువురు ఇన్వెస్టర్లు ముందుకొస్తున్నారన్నారు.వాటి ఏర్పాటుకు తాము కృషి చేస్తున్నామన్నారు. అంతేగాక రాష్ట్రంలోని సుదీర్ఘ సముద్రతీరంలో వాటర్ స్పోర్ట్స్, బీచ్ రిసార్ట్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.వైజాగ్-చెన్నై మధ్య క్రూజ్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.సీ ప్లేన్ ను పూర్తిస్థాయిలో తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజానీకానికి ఉపయోగపడేలా రిషికొండ ప్యాలెస్ ను తీర్చిదిద్దుతామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పర్యాటకరంగానికి పూర్తిగా తిలోదకాలిస్తే కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించిందన్నారు. అంతకుముందు తిరుమల చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ కు పర్యాటక శాఖ అధికారులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ ఇన్ చార్జ్ డా.పసుపులేటి హరిప్రసాద్, చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్ చార్జ్ దేవర మనోహర్, పుంగనూరు నియోజకవర్గ పార్టీ ఇన్ చార్జ్ సిరివెల్లు చిన రాయల్ తదితరులు ఘనస్వాగతం పలికారు.

## కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాకారం

మొదటిపేజీ తరువాయి

నిజమైన పాలనని ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు నిరూపిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆగస్టులో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీబస్సులో ఉచిత ప్రవేశం అమలుచేసి హామీలు నిలబెట్టుకుంటామని ప్రకటించారు. ఈకార్యక్రమంలోకూటమి నాయకులు, మండల అధ్యక్ష కార్యదర్శులు,బూత్,క్లస్టర్ ఇన్చార్జీలు, డిసీలు,అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్జీలకు సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలి

మొదటిపేజీ తరువాయి

వేయాలని, బాధ్యతాయుతం గా అర్జీదారుల సమస్యలపై సకాలంలో స్పందిస్తూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ఫిర్యాదులపై వేగవంతమైన పరిష్కారంపై సంబంధిత అధి కారులకుమార్గనిర్దేశంచేయాలన్నారు. అర్జీదారులు ఫిర్యాదు స్థితిపై సమాచారాన్ని 1100 ద్వారా తెలుసుకొనవచ్చునన్నారు. ఫిర్యాదుల పరిష్కార స్థితిలో ప్రతిస్పందనను తెలుసుకునేందుకు ఐవీఆర్ఎస్ డిజిటల్ యాప్ ప్రశ్నావళి ద్వారా తెలుసుకుంటూ, సంతృప్తి చెందని పక్షంలో మరల ఆ యొక్కదరఖాస్తు పునరావృతం అవుతుందన్నా రు. కావున నిర్దేశిత గడువులోగా అర్జీలు పరిష్కరిస్తూ అర్జీలు పునరావృతం కాకుండా అప్రమత్తంగావ్యవహరిస్తూ గడుగులోగా పరిష్కరిం చాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి, డిఆర్ఓ రాజకుమారి, డ్వామా పిడి మధుసూదన్, వికాస మేనేజర్ జి.రమేష్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం అందివ్వాలి

మొదటిపేజీ తరువాయి

డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనం ఆన్ లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం 921 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్..మాట్లాడుతూ ప్రజలలో సంతృప్తి స్థాయిని పెంచేలా పీజీఆర్ఎస్ దరఖాస్తుల అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారించాలన్నారు. పరిష్కరించిన దరఖాస్తులను జిల్లా అధికారి ఆడిటింగ్ చేయాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆడిట్ కి పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒకే అంశంపై నమోదయ్యే దరఖాస్తుల పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన అర్జీదారులు తమ అర్జీలను మీకోసం. ఎపి.జీవోవి.ఇన్. వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదార్లు తమ యొక్క అర్జీల నమోదు, అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100కి నేరుగా ఫోన్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌లో 69 అర్జీలు స్వీకరణ



–మీకోసంలో అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపాలి
–క్రియాత్మకంగా నూటికి నూరు శాతం సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలి
–ప్రజలకి మరింత సమర్థ వంతంగా పౌర సేవలు కోసం 9552300009 వాట్సాప్ గవర్నెన్స్
–పిజిఆర్ఎస్ పరిష్కార స్థాయి కోసం "1100"
–జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మీకోసంలో అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సకాలంలో క్రియాత్మకంగా నూటికి నూరు శాతం అర్జీ దారులు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఎస్. చిన్న రాముడు అన్నారు. సోమవారం గోకవరం మండల తహిసీల్దార్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, జిల్లా సర్వే అధికారి బి. లక్ష్మీ నారాయణ, డి ఎమ్ హెచ్ వో కే. వెంకటేశ్వరరావు,ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా జాయింట్‌కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కార కోసం జిల్లా,డివిజన్ మండల స్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగ పరచుకోవాలన్నారు. గోకవరం పిజిఆర్ఎస్ లో భాగంగా ప్రజల నుంచి 69 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజల ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించివాటిని సంతృప్తికర స్థాయిలో సమర్థవంతంగా పరిష్కరిస్తూ పారదర్శకతకు పెద్ద పీట వేయాలని, బాధ్యతాయుతంగా అర్జీదారుల సమస్యలపై సకాలంలో స్పందిస్తూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఫిర్యాదులపై వేగవంతమైన పరిష్కారంపై సంబంధిత అధికారులకు మార్గ నిర్దేశం చేసుకోవాన్నారు. డివిజన్ మండల స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజలు తమ అర్జీలను తమకు మండల స్థాయిలో సమీపంలో ఉండే అధికారికి అర్జీ ఇవ్వాలని, వాటిని ఆన్లైన్ లో నమోదు చేసి,వాటికి అర్హత మేరకు పరిష్కారం అయ్యే విధంగా సంబంధించిన పరిష్కారచర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వ డం కోసం "1100" మీ–కోసం కాల్ సెంటర్"కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయుటకు మరియు నమోదైన మీ అర్జీ ప్రస్తుత స్థితి తెలుసుకోవచ్చునని జాయింట్ కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రజల నుంచి పీజీఆర్ ఎస్ అర్జీలను జిల్లా , డివిజన్, మునిసిపల్ , మండల, సచివా లయ స్థాయిలో స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు.ప్రజలు తమసమస్యల పరిష్కారంకోసం meekosam.ap.gov.in పోర్టల్ లేదా 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం జరిగిందన్నారు. నేరుగా అర్జీలు ఇవ్వలేని వారు "మీ కోసం" వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా మీ ఫిర్యాదు నమోదు చేయవచ్చునని జాయింట్ కలెక్టర్ తెలియ చేశారు. వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా ప్రజలకి పౌర సేవలు పొందవచ్చు అని పేర్కొన్నారు. అందుకోసం ప్రజలు వారి సెల్ ఫోన్లు లో ఈ నంబర్ నిక్షిప్తం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో కే. వెంకటేశ్వరరావు, ఎ. డి. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ బి.లక్ష్మీనారాయణ, మండల తహసీల్దార్, పి.సాగర్, ఎంపీడీవో, ఎం. గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణా దినోత్సవం



–ప్రకృతి సంరక్షణ వ్యక్తిగత బాధ్యత
–డాక్టర్ బిఈవిఎల్.నాయుడు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ప్రకృతి పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. భవిష్యత్ తరాల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యకరమైన వాతావరణానికి బాటలు వేస్తూ ప్రకృతి పరిరక్షణలో ప్రతి వ్యక్తి భాగస్వామ్యం అవుతూ అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో ఆదిత్య డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ప్రకృతి వనరుల సంరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. నీటిని వృథా చేయకూడదని, వాడిన నీటిని మొక్కల పెంపెకానికి, ఇంకుడు గుంతలలోకి వెళ్ళేలా చేయాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని భూకాలుష్యాన్ని తగ్గించాలని, మొక్కలునాటడం, వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టి సహజవనరుల వినియోగాన్ని తగ్గించి వారసత్వ సంపదగా భవిష్యత్ తరాలకు అందించాలని తెలిపారు. తదుపరి కళాశాల పరిసరాలలో మొక్కలు నాటారు. వాటిని సంరక్షించే బాధ్యత ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇంచార్జ్ మూర్తి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, డి అశ్విని మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు

# ర్యాలీ, టోర్నమెంట్ ఏర్పాట్లను పరిశీలించిన జేసీ మీనా



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ క్రీడా మైదానం వేదికగా ఆగస్టు 3 నుంచి 20 వరకు ఆర్మీ నియామక ర్యాలీ, 1 నుంచి 12వ తేదీ వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్ షిప్ పోటీల ఏర్పాట్లను సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పరిశీలించారు. రెవెన్యూ, ఆర్మీ, కాకినాడ నగరపాలక సంస్థ, క్రీడా అభివృద్ధి, హాకీ ఆంధ్రప్రదేశ్ అధికారులతో ఏర్పాట్లపై జేసీ చర్చించారు.

ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ కాకినాడ జిల్లా అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ రెండు కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు పారిశుద్ధ్యం, క్రీడాకారులు వసతి, భోజనం ఇతర సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. ఈ నెల 30 నాటికి ఏర్పాట్లు పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జేసీ వెంట డీఆర్వో ఎస్.వెంకటరావు, ఆర్డీవో ఎస్.మల్లిబాబు, కాకినాడ నగర పాలక సంస్థ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీఎస్డీవో బి శ్రీనివాస కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ సీహెచ్ బాబురావు, ఆర్మీ అధికారులు, హాకీ ఆంధ్ర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిలో కూరుకుపోయిన కూటమి ప్రభుత్వం - చిర్ల జగ్గిరెడ్డి



– పేరవరంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం
– మండల పార్టీ కన్వీనర్‌గా కనుమూరి

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం మండల పార్టీకి కన్వీనర్ కనుమూరిరాజు శ్రీనివాసరాజు అధ్యక్షతన పేరవరం ఎస్వి ఫంక్షన్ హాల్ లో జరిగిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కారన్నారు. పైగా ప్రతిపక్ష నాయకులపై లేనిపోని కేసులు బనాయిస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. అంగన్వాడి కార్యకర్తల నియామకం నుండి వాడపల్లి వెంకటేశ్వర స్వామి డీసీ నియామకంవరకుల్కక్షలాదిరూపాయలు దండుకున్నారు. ఇదిజగమెరిగిన సత్యం అన్నారు. కార్యకర్తలంతా ఐక్యమక్యంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. నియోజవర్గంలో ఉన్న అధికార పార్టీ నాయకుల అన్నదమ్ములు చేస్తున్న ఆగడాలకు అంతులేకుండా పోయిందన్నారు. ప్రజలంతా వారిని గమనిస్తున్నారన్నారు. పార్టీ పరిశీలకుడు సిరిపురపు శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అధినే జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీకి పూర్వ వైభవం రానుందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ఈ ప్రభుత్వంలో అడుగడుగునా అవినీతి రాజ్యమేలుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం మండలపార్టీని ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. మండలపార్టీ అధ్యక్షులుగా కనుమూరి శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షుడిగా గంటి నాగేశ్వరరావు, గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా చిన్నం బేబీ, కేత ఏడుకొండలు, మరో 22 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పిటిసి బోనం సాయిబాబా, నాయకులు కప్పల శ్రీధర్, కర్రి నాగిరెడ్డి, చిలువూరి రామకృష్ణంరాజు, ముదునూరి కృష్ణంరాజు, కొల్లిశ్యామ్,గాదిరాజు రామకృష్ణంరాజు,గారపాటి గంగారాం చౌదరి, ఇందుకూరి కృష్ణంరాజు, ఎంపిటీసీలు, సర్పంచులు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** కాకినాడ కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ను సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకటరావులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ ను నిషేధించిన నేపథ్యంలో రూ. 1.60 లక్షల వ్యయంతో వేయ్యి లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రాముఖ్యంగా కలెక్టరేట్ అధికారులు, సిబ్బందికి, ప్రతి వారం పీజీఆర్ఎస్‌కి వచ్చే అర్జీదారులకు ఈ ప్లాంట్ ద్వారా తాగునీరు సదుపాయం కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎస్.రామ్మోహన్, ఎవిఎన్ శివా, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల సంరక్షణపై ట్రైబ్యునల్ తీర్పును పిల్లలు అప్పీల్ చేయలేరు



-వృద్ధులను నిర్లక్ష్యం చేసిన వారికి మూడు నెలల జైలు, రూ.5000 జరిమానా

-డిఆర్ఓ టి.సీతారామమూర్తి

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్** : తల్లిదండ్రుల సంరక్షణ విషయమై ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పుపై పిల్లలు కలెక్టర్‌కు అప్పీల్ చేయలేరని జిల్లా రెవిన్యూ అధికారి సీతారామమూర్తి తెలిపారు. వృద్ధుల పోషణ & సంక్షేమ చట్టం - 2007పై జిల్లా అధికారులకు అవగాహన కల్పించేందుకు రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ మందిరంలో నిర్వహించిన ఒరియంటేషన్ కార్యక్రమానికి సీతారామ మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ - ట్రైబ్యునల్ తీర్పు నచ్చకపోతే తల్లిదండ్రులు కలెక్టర్‌కు అప్పీల్ చేయవచ్చని, అయితే పిల్లలు మాత్రం సివిల్ కోర్టు ద్వారానే న్యాయం పొందవలసి ఉంటుందని వివరించారు. వృద్ధులను నిర్లక్ష్యం చేయడం అనేది దురదృష్టకర పరిణామమని, ఇటువంటి చర్యలు మానవీయ విలువలకు వ్యతిరేకమని అన్నారు. చట్టంలోని సెక్షన్ 7 (1) ప్రకారం డివిజన్ స్థాయిలో ట్రైబ్యునల్, జిల్లా స్థాయిలో అప్పిలేట్ ట్రైబ్యునల్ ఉండగా, సెక్షన్ 4 ప్రకారం తల్లిదండ్రులు లేదా వారి తరఫున ఇతరులు పోషణకు దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. ట్రైబ్యునల్ సుమోటోగా కేసులు స్వీకరించవచ్చని తెలిపారు. సెక్షన్ 24 ప్రకారం వృద్ధులను విడిచిపెట్టి వెళ్లిన వారికి మూడు నెలల జైలు, రూ.5000 జరిమానా లేదా రెండూ విధించవచ్చని చెప్పారు. తల్లిదండ్రుల నుంచి పొందిన ఆస్తిని పిల్లలు తగిన సంరక్షణ లేకపోతే తిరిగి తీసుకునే అవకాశాన్ని ఈ చట్టం కల్పిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా హిజ్రాల, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏవి శ్రీనివాస్ మాట్లాడుతూ - రాష్ట్రంలో 2007లో చట్టం రూపొందించగా, 2011లో నిబంధనలు అమలులోకి వచ్చాయని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లాలో పలు గుర్తింపు పొందిన వృద్ధాశ్రమాలు ఉన్నాయి అని తెలిపారు. తాము స్వయం పోషించుకోలేని వృద్ధులు తమ పిల్లల నుంచి నెలకు రూ.10,000 వరకు పోషణ పొందవచ్చని స్పష్టంచేశారు. సెక్షన్ 21 (2) ప్రకారం వృద్ధుల ప్రాణ, ఆస్తి భద్రత బాధ్యత పోలీసులదని తెలిపారు. వారిని రెండు నెలలకొకసారి సందర్శించి, వారి స్థితిగతులు తెలుసుకోవాల్సిన బాధ్యత పోలీస్ యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# ఎస్పీ బాలసుబ్రమణ్యం జాతీయ అవార్డు ప్రధానోత్సవం



ముఖ్య అతిథిగా పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్

**కిర్లంపూడి, మేజర్ న్యూస్** : కళాకారులకు ఎస్పీ బాలసుబ్రమణ్యం జాతీయ అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమం జగ్గంపేట సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ నందు వందన యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పులి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించినారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథులుగా తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుండి కళాకారులు సింగర్స్ అందరికి ఎస్పీ బాలసుబ్రమణ్యం నేషనల్ అవార్డు ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయం అని ఇక్కడికి వచ్చి కళలు ప్రదర్శించడం చాలా ఆనందదయాకం కళలు అంతరించి పోకుండా వాటిని నిరంతరం ఇలా కాపాడుకోవాలని అన్నారు. 100మంది కళాకారులకు ఎస్పీ బాలసుబ్రమణ్యం జాతీయ అవార్డును తుమ్మలపల్లి రమేష్ చేతుల మీదుగా ప్రధానం చేసినారు ఈ అవార్డు మహోత్సవంలో సీనియర్ ఎన్జీవో బోడపాటి కాంతం మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రమణ్యం అవార్డు అందుకోవడం ప్రతి ఒక్కరికి గర్వకారణం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకురాలు చల్లా రాజ్యలక్ష్మి క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు జుత్తుక నాగేశ్వరరావు మాదారపు వీరబాబు కురుమల్ల నాగేశ్వరరావు కాయల మణికంఠ మ్యూజిక్ మాస్టర్ ముసలి విజయభాస్కర్ సింగర్ సుజాత, రత్న, సరిపల్లి రమణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర ఆయకట్టు భూములకు పుష్కరంగా సాగునీరు



-ఈఈ రాజేశ్వరరావు

**రంగంపేట, మేజర్ న్యూస్** : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ప్రజాప్రతినిధులు సూచనలు మేరకు పుష్కర ఆయికట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందిస్తామని పుష్కర ఎత్తిపోతల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేశ్వరరావు హామీ ఇచ్చారు సోమవారం రంగంపేట సమీపంలోని బొర్రంపాలెం పుష్కర మినీ ఎత్తిపోతల పథకం మోటార్ను ఆయన మండల సాగునీటి సాధన కమిటీ సభ్యులు పుట్టా సోమన్న చౌదరి మోదుకూరి గోపాలకృష్ణ చేత ప్రారంభింపజేశారు అనంతరం రైతులను ఉద్దేశించి రాజేశ్వరరావు మాట్లాడుతూ గతవారం ఎర్రంపాలెం ఎత్తిపోతల నుండి నీటి తోడకం ప్రారంభమైందని ఇప్పుడు బొర్రంపాలెం కూడా ప్రారంభం కావడంతో ఇక నీటి ఎద్దడి ఉండదన్నారు వాస్తవానికి ఎర్రంపాలెం బొర్రంపాలెం ఎత్తుపోతల పథకాలు గండేపల్లి మండలానికి ఎక్కువ ప్రయోజనం కలిగించినా రంగంపేట మండలంలో కూడా మర్రిపూడి కోటపాడు వెంకటాపురం పెదరాయవరం చంద్రేడు ఒడిసె లేరు గ్రామాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా బొర్రంపాలెం ఎత్తిపోతల పథకం ద్వారా తమ గ్రామానికి చెందిన వెయ్యి ఎకరాలకు పైగా సాగవు తుందని పెదరాయవరం గ్రామ రైతు నాయకుడు మోదుకూరి గోపాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు చాగల నాడు ఎత్తిపోతల నీరు శివారుగ్రామాలైన దొడ్డిగుంట సింగంపల్లి మర్రిపూడి గ్రామాలకు అందటం లేదని ఈ కారణంగా బొర్రంపాలెం ఎత్తిపోతల మిగులు జలాలను చాగల నాడు కాల్వకు మళ్ళించాలని మర్రిపూడి గ్రామానికి చెందిన పుట్టా సోమన్న చౌదరి విజ్ఞప్తి చేశారు ఈరోజు ఒక మోటార్నే వదిలారని వెంటనే రెండో మోటార్ కూడా వదలాలని నీటి సంఘం సభ్యుడు మోదుకూరిసత్యనారాయణ కోరారు

-చిరు సత్కారంఅనంతరం పుష్కర ఈఈ రాజేశ్వరరావు డియి నాగేంద్ర ప్రసాద్ లను రంగంపేట మండలం పుష్కర సాగునీటి లబ్ధిదారులు తరఫున రైతులు సత్కరించారు ఈ కార్యక్రమంలో పుష్కర ఎ ఈ ప్రమీల ఇద్యుత్ ఏఈ శాంతి రైతు ప్రతినిధులు మద్దిపాటి వీర్రాజు శ్రీరాములు సత్తిబాబు రాంబాబు మొదలగువారు పాల్గొన్నారు వారం రోజుల్లో రెండో మోటర్ ను కూడా ప్రారంభిస్తామని కార్యక్రమాన్ని ముగిస్తూ ఈ ఈ రాజేశ్వర ప్రకటించారు.

# తస్మాత్ జాగ్రత్త

-సిఐ వైఆర్‌కె శ్రీనివాస్



**గండేపల్లి, మేజర్‌న్యూస్** : సర్కిల్ పరిధిలోని గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల ప్రజలకు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలియ జేయునది. ఇద్దరు యువకులు స్నాచింగ్ నేరస్తులుగా అవతారం ఎత్తి ఉన్నారు. వారు మహిళల మెడలలో బంగారు వస్తువులను చాకచక్యంగా తెంపుకొని పోతారు. వీరు జగ్గంపేట సర్కిల్ పరిధిలో ఉన్న ప్రజలకు కనిపిస్తే వెంటనే 944 7965 29 నెంబర్కు కానీ, 94 4 07 96569, 944090 4834, 944090 4841 నంబర్లకు ఫోన్ చేసి పోలీసువారికి సమాచారం ఇవ్వవలసిందిగా సీఐ వై ఆర్ కె శ్రీనివాస్ కోరారు. మీరిచ్చే సమాచారంతో నేరస్తులను పట్టుకునే అవకాశం కలుగుతుందని తప్పనిసరిగా ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి



**పెరవలి, మేజర్ న్యూస్** : పెరవలి గ్రామానికి చెందిన మల్లుల సూరి పండు, తండ్రి వెంకన్న, వయసు 52, కులము శెట్టిబలిజ అను అతను జూలై 27 వ తేదీన సాయంత్రం సుమారు 5:30 గంటలకు పెరవలి నుండి తణుకు వెళ్ళు బైపాస్ రోడ్ లో గల శివశక్తి క్రాకర్స్ షాపు ఎదురుగా గల పాత ఇనుప సామాను కొట్టు దగ్గర తన మోటార్ సైకిల్ పార్క్ చేసి ఉండగా రావులపాలెం నుండి వస్తున్న ఏపీ 16 సీఎం 3889 నెంబర్ గల కారు స్పీడ్ గా వచ్చి అతనిని గుద్ది అక్కడే పాత ఐరన్ ఎగమతి చేస్తున్న ఐచర్ వ్యాను ఢీకొట్టగా కారులో ఉన్న కొమ్మోజు విశ్వేశ్వరరావు అను అతనికి మరియు మల్లుల సూరి పండుకి గాయాలు అయినందున చికిత్స నిమిత్తం తణుకు హాస్పిటల్ లో జాయిన్ చేసినట్లు, డాక్టర్ గారు పరీక్షించి కొమ్మోజు విశ్వేశ్వరరావు చనిపోయినట్లు. మల్లుల సూరి పండు చికిత్స పొందుతునట్లు అతని భార్య అయిన మల్లుల నాగమణి ఇచ్చిన ఫిర్యాదు పై పెరవలి ఏఎస్ఐ సూర్యచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కార్మికుల ఆకలి కేకలు వినిపించడం లేదా..?

-ప్రజల తాగునీటి కష్టాలు కనిపించడం లేదా..?

-సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర



**జగ్గంపేట,మేజర్‌న్యూస్** : ప్రజలకు తాగునీరు అందివ్వడం, ప్రభుత్వంలో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం ప్రభుత్వంలో ఉన్న పాలకులు, అధికారుల బాధ్యత. పాలకులు, అధికారులు తమ బాధ్యతలను విస్మరించారని గత 20 రోజుల నుంచి తమకు రావలసిన 19 నెలల జీతాలు ఇప్పించాలని కార్మికులు సమ్మె చేస్తున్నా వారి ఆకలి కేకలు అధికారులకు వినిపించడం లేదని,ప్రజల తాగునీటి కష్టాలు పాలకులకు కనిపించడం లేదని పాటంశెట్టి సూర్యచంద్ర ఆరోపించారు. రంపచోడవరం,జగ్గంపేట,రాజానగరం శాసనసభ్యులు బాధ్యత వహించి వెంటనే కార్మికులకు జీతాలు మొత్తం బకాయిలు ఇప్పించే విధంగాను, ప్రజల తాగునీటి సమస్య తీర్చేందుకుగాను సంబంధిత పంచాయతీరాజ్ శాఖ మంత్రి వర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి సమస్య తీవ్రతను వివరించి సమస్య పరిష్కారానికి కృషి చేయవలసిందిగా సంబంధిత శాసనసభ్యులను కోరారు. పాలకులు, అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా కాలయాపన చేసినట్లయితే ఆగస్టు 18వ తేదీన పదివేల మంది మహిళలతో రాజమండ్రి జిల్లా కలెక్టరేట్ ని ముట్టడిస్తామని పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు. గోకవరం తహసిల్దార్ ఆఫీస్ నందు జాయింట్ కలెక్టర్ చినరాముడు గారికి కార్మికులకు జీతాలు చెల్లించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని బాధితులతో కలిసి పాటంశెట్టి సూర్యచంద్ర వినతిపత్రాలు అందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# నర్సాపురం మెటల్ క్వారీపై విచారణ ఏకపక్షం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** నర్సాపురం మెటల్ క్వారీ పై విచారణ ఏకపక్షంగా జరిగిందని ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు, నర్సాపురం మెటల్ క్వారీ పిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేసారు. అన్ని ముందే నిర్ణయించుకున్నాక విచారణకు మమ్మల్ని పిలవడం ఎందుకని ప్రశ్నించారు. రంపచోడవరం మండలం నరసాపురం గ్రామంలో కొనసాగుతున్న మెటల్ క్వారీపై చర్యలు తీసుకోవాలని నరసాపురం గ్రామస్తులు మరియు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పలుమార్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదు చేసిన విషయం అందరికీ విధితమే. దీనిపై స్పందించిన రంపచోడవరం ప్రాజెక్టు అధికారి రంపచోడవరం సబ్ కలెక్టర్ మైనింగ్ ఏడి వారిని క్షేత్రస్థాయి సంయుక్త దర్యాప్తుకు ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామానికి మరియు మెటల్ క్వారీ వద్ద ఎంక్వయిరీ అధికారులు వచ్చి విచారణ జరిపించాల్సి ఉండగా అలా చేయకుండా రంపచోడవరం సబ్ కలెక్టర్ ఫిర్యాదుదారులకి వాట్సాప్ ద్వారా నోటీసులు పంపించి రంపచోడవరం తాసిల్దార్ చేత ఫోన్లో తోటి ఎంక్వయిరీకి రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి పిలిపించారు. ఈ విచారణకు వారిపై ఫిర్యాదు చేసిన నరసాపురం గ్రామస్తులు మరియు ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు అదేవిధంగా క్వారీ నిర్వహిస్తున్న నాన్ ట్రైబల్స్ బినామీలు హాజరయ్యారు. ఈ విచారణలో సబ్ కలెక్టర్, ఏడి మైనింగ్ వారు పూర్తిగా క్వారీ బినామీలకే అనుకూలంగా మాట్లాడారని, ఫిర్యాదు చేసినవారికి "అక్కడ క్వారీ నిర్వహిస్తే మీకేంటి నష్టమని" చెప్పటం జరిగిందని ఆదివాసీలు, ఆదివాసి నాయకులు ఆవేదన వ్యక్తపరిచారు. పూర్తి స్థాయి పర్మిషన్లతోనే క్వారీ నడుస్తుందని సబ్ కలెక్టర్ మరియు మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ వారు తెలపటం సరికాదని, పర్మిషన్ ఇచ్చింది ఆ డిపార్ట్మెంట్ వారే కాబట్టి వాళ్ళ తప్పును కప్పిపుచ్చుకోవటానికి ఫిర్యాదుదారుల యొక్క మాటలను తోసిపుచ్చారని ఆదివాసీలు ఆదివాసీ నాయకులు ఆవేదన వ్యక్తపరిచారు. నరసాపురం గ్రామానికి చెందన ఒక గిరిజన మహిళకు ఎంసి ఫీల్డ్ ల్యాండ్లో ఉన్న మెటల్ క్వారీకి ఎలా పర్మిషన్ ఇస్తారని, ఇది పీసా చట్టానికి విరుద్ధమని ఈ సందర్భంగా ఆదివాసి నాయకులు ఉన్నత అధికారులకు ప్రకటన ద్వారా కోరారు. పర్యావరణ అనుమతులు లేవు, క్వారి చుట్టుపక్కల ఉన్న రైతుల అభిప్రాయ సేకరణ లేదు, మైనింగ్ నిధులకు జవాబుదారితనం లేదు, మైనింగ్లో ఎటువంటి ఆడిట్లు జరగటం లేదు, మెటల్ రాయిని బాంబులు పెట్టి పేలుస్తున్నారని వీటన్నిటికీ కూడా పర్మిషన్లు లేవని అలాంటప్పుడు నరసాపురం మెటల్ క్వారీ ఏ రకంగా అనుమతి పొందినట్లని వారు ప్రశ్నించారు. తక్షణమే నరసాపురం మెటల్ క్వారీని నిలుపుదల చేయాలని అలాగే విచారణలో క్వారీ నిర్వహణదారులకే వంతు పలికిన సబ్ కలెక్టర్ మరియు అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారికి, జిల్లా కలెక్టర్కి, డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ వారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందని ఆదివాసీలు, ఆదివాసీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు, డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, డివిజన్ కోఆర్డినేటర్ పీట ప్రసాదు, డివిజన్ నాయకులు కంగాల అబ్బాయి దొర, క్వారి వల్ల నష్టపోతున్న ఆదివాసి రైతులు మరియు నర్సాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంటింటికి రేషన్ 30శాతం పంపిణీ - తహశీల్దార్ వెంకటలక్ష్మీ




**పెద్దాపురం రూరల్,మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, పట్టణ పరిధిలో 65 సం.లు పైబడిన వృద్దులు, మంచంపై ఉన్న రోగులు, దివ్యాంగులకు వారం రోజుల ముందుగానే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ పంపిణీ చేపట్టడం జరిగిందని, తహశీల్దార్ తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ తెలిపారు. జూలై 26 నుంచే రేషన్ డీలర్లు ఇంటింటికి వెళ్ళి రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పెద్దాపురం పట్టణ, మండల పరిధిలో 4946 మందికి ఇంటిటికి రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇప్పటివరకు 30శాతం రేషన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా మిగతావార్కి రేషన్ పంపిణీ చేయాలని సంబంధిత సిబ్బందికి, రేషన్ డీలర్లుకి ఆమె సూచించారు.

# ఆగస్టు 1 నుంచి 8 వరకు గ్రామాల్లో ఆదివాసి వారోత్సవాలను నిర్వహిస్తాం

## –ఆదివాసి గిరిజనసంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్

**కూనవరం, మేజర్న్యూస్ :** ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆగస్టు ఒకటి నుంచి 8వ తేదీ వరకు ప్రతి ఆదివాసీ గ్రామంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో జెండాలు ఎగరవేసి ఆదివాసి వారోత్సవాలు జరపాలని, 9వ తేదీన కూనవరంలో జరిగే కోయ్ తోర్ పండూం దక్కాట్ కార్యక్రమానికి ఆదివాసీలంతా తరలిరావాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు కూనవరం మండలంలో ఆదివాసి గిరిజన సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బాబు.రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలందరూ తొమ్మిదో తేదీన ఉత్సవాలు జరపడమే కాదు.... వారి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ ఆదివాసి హక్కులు చట్టాలను పటిష్టంగా పాలకులు అమలు జరపాలని నినదించాల్సిన రోజని, రోజురోజుకు ఆదివాసీ సమాజంపై జరుగుతున్న దాడులను ఖండించాలని కోరారు.

అదే తరుణంలో మన సంస్కృతి సాంప్రదాయాల్ని ఆటపాటలను కాపాడుకోవాలని దానికనుగుణంగానే ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో లికోయ్ తోర్ పండూం దక్కాట్ – కూనవరంలి కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక ఆదివాసి ఉద్యోగులు మేధావులు ప్రజాప్రతినిధులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరవ్వాలని దానితో పాటుగా ఆర్థిక సహకారాన్ని అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సీసం.సురేష్, పూనెం.ప్రదీప్ కుమార్, పులి బోజ్జి, తెల్లం.తమ్మయ్య, సర్పంచ్ నాగమణి, సర్పంచ్ వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు బెల్ట్ షాపు నిర్వాహకులు అరెస్టు

**అమలాపురం, మేజర్ న్యూస్ :** డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఆఫీసర్, అమలాపురం ఎస్.కె.డి.వి.ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ అమలాపురం డిటిఎఫ్ సీఐ ఎల్.చిరంజీవి తమ బృందంతో మండలములో సోమవారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. అమలాపురం ఎక్సజ్ స్టేషన్ పరిధిలో గల తొత్తరముడి గ్రామంలో నల్లి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి పరిమితికి మించి మద్యం సీసాలు 5 కలిగి ఉన్నాడు. అదే విధంగా దాసరి శివా ప్రసాద్, కామనగారువు గ్రామం వద్ద 7 మద్యం సీసాలు, చిల్లే కిషోర్ కుమార్, ముక్తాశ్వరం వద్ద 5 మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని ముగ్గురుపై విడివిడిగా కేసులు నమోదు చేయడం చేసినట్లు అమలాపురం సీఐ వి.టి.వి.వి.సత్యనారాయణ తెలిపారు.

# రాధాకృష్ణ వేణికి డాక్టరేట్



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం మాధవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాకినాడ జిల్లా యందు పనిచేయుచున్న ఉపాధ్యాయిని డాక్టర్ కె. రాధాకృష్ణ వేణి గీతం యూనివర్సిటీ నుండి డాక్టరేట్ తీసుకున్న సందర్భంలో సోమవారం పాఠశాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన కాకినాడ డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి వారు నాయుడు వెంకటేశ్వరరావు మరియు సామర్లకోట మండలం ఎంఈఓ వై. శివరామకృష్ణయ్య మరియు ఎంఈఓ 2 పి. పుల్లయ్య మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. మురళీకృష్ణ మరియు పాఠశాల పనిచేయుచున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు కలిసి వారికి ఘనంగా సన్మానం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కూనిశెట్టి రాధాకృష్ణ వేణి ని డాక్టరేట్ సాధించడంలో పట్టుదల మరియు చేసిన కృషి ఫలితంగా ఆవిడ సాధించినటువంటి ఈ పీహెచ్డీ అనేది పాఠశాలలో ఉపాధ్యాయునిగా అత్యున్నత స్థాయికి వెళ్లడం చాలా గర్వకారణం వారి సేవలు మరింత పాఠశాలకు మరియు గ్రామ అభివృద్ధికి ఉపయోగించాలని ఈ సందర్భంగా విచ్చేసినటువంటి అధికారులు ఘనంగా సత్కరించి చేసిన సేవల్ని మరింత మెచ్చుకుని సన్మానం చేయడం జరిగింది విద్యార్థుల్లో మరింత మార్పు తీసుకురావడానికి ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థులుగా ఉండి వారు మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా వక్తలు అవన్నీ అభినందిస్తూ ఆవిడ్ని మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని ఈ సందర్భంగా వక్తలు మాట్లాడడం జరిగింది.

# సమస్యలతో ప్రజలు - "సెల్ ఫోన్ తో" అధికారులు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) పిజి ఆర్ ఎస్ కార్యక్రమంలో... ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధిక సంఖ్యలో ఫిర్యాదుదారులు పాడా కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను అధికారులకు విన్నవించేందుకు క్యూ కట్టారు. ఇదే సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు అత్యధిక సమయం సెల్ఫోన్ వినియోగిస్తూ... (ఫోన్ మాట్లాడుతూ కొందరు, వివిధ రకాల మెసేజ్లు చదువుతూ మరికొందరు, వీడియోలు చూస్తూ ఇంకొందరు కనిపించారు) అక్కడికి వచ్చిన వినియోగదారులు ఈ దృశ్యాలను చూసి... ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తమ సమస్యలు అధికారులకు చెప్పుకుంటే పరిష్కారం అవుతాయని ఆశగా వస్తే... వారంతా సెల్ ఫోన్ వినియోగిస్తూ... కాలక్షేపం చేయడంపై ఫిర్యాదుదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజిఆర్ఎస్) కార్యక్రమానికి హాజరైన అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రెండు అర్జీలు



**గండేపల్లి, మేజర్న్యూస్ :** మండల కేంద్రమైన గండేపల్లి తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు తాసిల్దార్ కార్యాలయానికి సంబంధించిన రెండు అర్జీలు వచ్చినట్లు తాసిల్దార్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పరిష్కార వేదికలో ఎంపీడీవో కె,చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీవో ఐఎన్ శ్రీనివాస్, ఏపిఎం డిఆర్డి సన్యాసిరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఎం కృష్ణంరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఏ, నాగ పార్వతి, గృహ నిర్మాణ శాఖ వర్కర్, వ్యవసాయ శాఖ ఏఈఓ, విద్యాశాఖ సిఆర్పి, ఆరోగ్యశాఖ అసిస్టెంట్, తదితరు హాజరైనట్లు తాసిల్దార్ తెలియజేశారు.

# ఇన్వెస్టిచర్ సెర్మని "భాధ్యతాయుత నాయకుల ప్రమాణ స్వీకారం"





**కాకినాడ, మేజర్ న్యూస్ :** లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్, ప్రాంగణంలో సోమవారం "బాధ్యతాయుత నాయకుల ప్రమాణ స్వీకారం" కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ డా.ఎన్.సుగుణా రెడ్డి, అతిథిగా విచ్చేసిన కల్నల్ హరిందర్ సింగ్ మానిక్ (3(ఎ) గర్ల్స్ బెటాలియన్, ఎన్‌సిసి) పాఠశాల ప్రిన్సిపాల్ వందన బోహ్రా, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ హేమలత, హౌస్ ఇంఛార్జ్ ఉపాధ్యాయులందరూ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, చిన్నారుల శ్లోకాలాపనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ముందుగా లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ డా. ఎన్.సుగుణా రెడ్డి మాట్లాడుతూ సాధారణంగా ఎన్నికల సమయంలో తాము ఎన్నుకొన్న ప్రజాప్రతినిధి తమను అన్నివిధాలా ఆదుకొని నడిపిస్తాడని నమ్ముతారు. అదే విధంగా ఇప్పుడు బాధ్యతలు స్వీకరిస్తున్న హెడ్ బాయ్, హెడ్ గర్ల్ పైన మరింత బాధ్యతలు పెరుగుతాయి. వారిపై మిగిలిన విద్యార్థులకు నమ్మకం ఉంటుందని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకూడదని, ప్రతీ ఒక్కరూ తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తు, దిశా నిర్దేశం చేయాలనీ సూచిస్తూ తన అభినందనలను తెలియజేశారు. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన కల్నల్ హరిందర్ సింగ్ మానిక్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుండే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని తెలియజేశారు. అంతేకాకుండా ఎన్నికలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను బ్యాడ్జీలతో సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి వందన బోహ్రా విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నాయకులు సరైన క్రమశిక్షణతో మెలగాలని ఆమె తెలిపారు.లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రతీ సంవత్సరం నిర్వహించే ఈ పదవీ ప్రమాణ స్వీకార వేడుక ఎంతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు భాధ్యతలు అప్పగిస్తు హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్స్, హౌస్ కెప్టెన్లు, స్పోర్ట్స్ కెప్టెన్లు, క్లబ్ ఇంచార్జీలను, ఎన్నిక ప్రక్రియ ద్వారా ఎంపిక చేశారని తెలియజేశారు. నైతిక విలువలను పాటిస్తే, భాధ్యతతో తమ పదవులను నిర్వహిస్తామని ప్రమాణం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కీలకమ్మైనవని తెలిపారు అంతే కాకుండా బాధ్యతలు స్వీకరించిన నాయకులందరితో ప్రమాణస్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్నికలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు హెడ్ బాయ్ గౌతు శరణ్, వైస్ హెడ్ బాయ్ శేషు రిషిత్ రెడ్డి నల్లమిల్లి, హెడ్ గర్ల్ స్వేఛ్ఛ, వైస్ హెడ్ గర్ల్ నిశిత చోడే, 4 హౌస్ కెప్టెన్స్– అమ్వీ ముఖర్జీ, రిషవ్ రాజ్, వైష్ణవి, రజియా, వైస్ కెప్టెన్స్ – అనీష్, అమృత వర్షిణి, అర్జున్, తారున్య, స్పోర్ట్ కేప్టెన్స్– అహాన్, హిమశ్రీ, మరియు వైస్ కెప్టెన్స్ – సూర్య, లోచన, డిసిప్లెయిన్ కేప్టెన్స్ – యస్మిత్ ఆర్యమాన్, వినోద్ విలియమ్స్ మరియు వైస్ కెప్టెన్ విరాజ్, క్లబ్స్ సెక్రటరీస్‌గా రుత్విక, భార్గవి, మహిత్, సౌమ్య, లోహిత, అక్షిత్ రెడ్డిలు తమను గెలిపించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అంతే కాకుండా పాఠశాలను మరింతగా అభివృద్ధి చేయడానికి నిరంతరం తమ వంతు కృషి చేస్తామని విద్యార్థులందరినీ, ఒకే మాటపై ఉండే విధంగా తోడ్పాటు అందిస్తామని తెలిపారుదీనిలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు చక్కటి నృత్య ప్రదర్శనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ అలరించారు.

# పిసి, పి& డిటి చట్టం పటిష్ఠ అమలుకు చర్యలు - ఆర్డీఓ శ్రీరమణి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ కె.శ్రీరమణి అధ్యక్షతన డిప్యూటి డిఎం & హెచ్ఓ డా. ఎన్.ప్రశాంతి ఆధ్వర్యంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి, పి& డిటి) పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ తెలుపుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994 అమలుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డివిజన్ పరిధిలోని చట్టం అమలుతీరు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు తదితర సంబంధిత వివరాలపై ఈ సమావేశంలో చర్చించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్‌లు పి.సురేష్‌కుమార్, కె.కృష్ణప్రసాద్, ఎస్.గౌరీశ్వరి, మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి లక్ష్యాల సాధనకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలి





**– జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి**

**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల పురోగతి, ప్రగతి సూచికల లక్ష్యాల సాధనకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం అంబాజీ పేట మండల తాసిల్దార్ కార్యాలయం సచివాలయ సందర్శనతోపాటు క్షేత్రస్థాయిలో రీ సర్వే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశా లలో ఆశించిన పురోగతిని తీసుకురావాలని సిబ్బందినీ ఆదేశించారు అర్హత కలిగిన కౌలుదా రులకు సిసిఆర్సి కార్డులు జారీ, అందరికీ ఇండ్లు, అన్నదాత సుఖీభవ కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్‌ఏ 2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా నియోజకవర్గాలవారీగా దార్శనిక ప్రణాళికల రూపకల్పన జరిగిందని, శాఖల వారీగా కీలక పురోగతి సూచికలు (కేపీఐ)లపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి ప్రధానంగా ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టి, రైతులను ప్రోత్సహించాలన్నారు.. వ్యవసాయం,రెవెన్యూ సచివాలయ శాఖల అధికారులతో స్వర్ణాంధ్ర విజన్ కీలక ప్రగతి సూచికలు (కేపీఐ)పైఆరా తీశారు వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా శాఖల వారీగా నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టిగా, సమన్వ యంతో పనిచేయాలన్నారు.ఈ సూచికల్లో ప్రగతి మొత్తం జిల్లా అభివృద్ధికి దోహద పడుతుందని వివరించారు. రీ సర్వే ప్రక్రియలో పురోగతి తక్కు వగా ఉందని ఆశించిన పురోగతిని సాధించాలని ఆదేశించారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని అదే విధంగా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందించే దిశగా పాటు పడాలన్నారు ప్రగతి సూచికల్లో పురోగతిని ఎప్పటికప్పుడుపర్యవే క్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి ఏడు సూచికలున్నాయన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక రాబడి, ఆదాయానికి ప్రకృతి సాగు దోహదం చేస్తుందని, ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తుల సాధన అనేది ఆరోగ్య ఆంధ్ర సాకారానికి కీలకమన్నారు. మనతో పాటు భవిష్యత్తు తరాలు రోగాలు బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యవంఎ తులుగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులు ముఖ్యమని వివరించారు.స్థానిక పరిస్థితులు, వనరులు ఆధారంగా రైతులను ఉద్యాన పంటలు దిశగా ప్రోత్సహించాలని, జీవన ఎరువులు ఉపయోగి ంచడం వల్ల ఎరువుల భారం తగ్గుతుందన్నారు. రైతులకు పంటల పెట్టుబడి ఖర్చులకు ఉపయోగపడేలా సీసీఆర్సీ కార్డుల ద్వారా సత్వరం బ్యాంకు రుణాలు మం జూరయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవా లన్నారు. ఎక్కడా రుణాలు మంజూరు కాలేదనే పరిస్థితి ఉండ కూడదన్నారు. వార్షిక రుణ ప్రణాళికల ఆధారంగా రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోతాసిల్దార్ జి.చినబాబు, మండల వ్యవసాయ అధికారి కడలి ధర్మారావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఏడుకొండలు, మండల సర్వేర్ పెద్దిరాజు, విఆర్వోలు, గ్రామ సర్వేలు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత నాలుగు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ కుగోకవరం మ ండలం వెదురుపాక గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు పిల్లా అర్జున్ సారది (చంటిబాబు), గోకవరం మండల ఐటీడీపీ చాంపియన్ బత్తుల శ్రీనివాస సారంగదరుడు(ఎస్ బాబు)ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ అన్నా క్యాంటీన్ కు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై అన్నా క్యాంటీన్ ప్రారంభించారు. అనంతరం పేదలకు అన్నం వడ్డించారు.ఈ సందర్భంగా పిల్లా చంటిబాబు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం పేదవారి ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ప్రతిపక్షంలో ఉండి గత నాలుగు సంవత్సరాలుగా దాతల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని ఈ రోజు నేను ఎస్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్తకొండ బాబు, పిల్ల చంటిబాబు, ఎస్ బాబు, సొసైటీ డైరెక్టర్ నండ్ల చిరంజీవి,బోదిరెడ్ల సుబ్బారావు, వేములకొండ జోగారావు, గొంతిన రాజు, దేగల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు

**– అన్నదాన భవన నిర్మాణానికి విరాళం**





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు అన్నారు. సోమవారం కూటమి నాయకులు కాబోయే చైర్మన్ ముదునూరి వెంకటరాజుతో కలిసి ఆలయం వద్ద చేపట్టిన కోనేరు అభివృద్ధి పనులను, శ్రీనివాస ప్రాంగణం వద్ద నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అన్నదాన భవన నిర్మాణానికి రాజమండ్రికి చెందిన గాధంశెట్టి వెంకటనారాయణ, సత్యవతి దంపతులు రూ.40,004లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించి స్వామివారి చిత్రపటం అందించారు.

## పేకాట శిబిరంపై దాడి ఆరుగురు అరెస్ట్

**– ఎస్సై నరసింహమూర్తి**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రాజవొమ్మంగి గ్రామ శివారు ఆదివారం సాయంత్రం నిర్వహిస్తున్న పేకాట శిబిరం పై దాడి చేసి పేకాట ఆడుతున్నఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు. అలానే వారి వద్ద నుండి 104 పేక ముక్కలు రూ 1910 సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. స్టేషన్ పరిధిలో ఎవరైనా పేకాట, గుండాట వంట అసాంఘిక కార్యకలాపాలకు పాల్ప డితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై నరసింహ మూర్తి హెచ్చరించారు.

# విద్యుత్ "స్మార్ట్ మీటర్" మార్పుపై ఫిర్యాదు

**– పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన వినియోగదారుడు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** తమ అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్ మార్పు చేయడం పై చర్యలు తీసుకోవాలని మరియు తమ మునుపటి విద్యుత్ మీటర్ మాకు తిరిగి అమర్చవల్సిందిగా కోరుతూ... పిఠాపురం పట్టణం కత్తులగూడెంనకు చెందిన చెందిన కొయ్య శ్రీను అనే వినియోగదారుడు పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. గత కొన్ని సంవత్సరాలుగా ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నామని, ( పట్నూరి వెంకన్న ) పేరు గల మీటర్ (సర్వీస్ నెంబర్ 1452520501005473) ఈ నెల 16- 07- 2025 తేది మధ్యాహ్నం, మేము ఇంట్లో లేని సమయంలో బాగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ మార్చేసి అదానీ స్మార్ట్ మీటర్ అమర్చినట్లు మేము గ్రహించడం జరిగిందన్నారు. ఇంటి బాధ్యతగా నా అనుమతి గాని, మా ఇంటి యజమాని అనుమతి గాని లేకుండా మీటర్ మార్చడం జరిగిందని, ఇది సరికాదు అని వెంటనే పిఠాపురం విద్యుత్ శాఖ ( ఎ.ఈ మరియు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ) శ్రీనివాస్ వారికి వినతి పత్రం ద్వారా పిర్యాదు చేసి, ఈ సమస్యపై వారిని అడగగా... ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల యొక్క అదానీ స్మార్ట్ మీటర్లు సమర్థిస్తూ ఇది ప్రభుత్వం నిర్ణయం అని, ఎవరు ఒప్పుకున్న ఒప్పుకోకపోయినా వారి అనుమతులతో మాకు సంబంధం లేదని, ఎందుకు మారుస్తున్నాము అనే వివరణ ఎవరికి ఇవాల్సిన పని లేదని, ఆ సమయంలో ఇంటి ప్రాంగణంలో ఎవరు ఉన్నా సరే వారి సమక్షంలో మీటరు మార్చేస్తాం... అది ఎవరైనా సరే మేము మీటర్ మార్చుకొని వెళ్ళిపోవడం జరుగుతుందని, ప్రతి ఇంటికి అదానీ స్మార్ట్ మీటర్ మార్చడం జరుగుతుందని, మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి... కానీ మీటర్ మార్చడం కుదరని పని అంటూ వారు మాతో దురుసుగా సమాధానం చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా అదానీ స్మార్ట్ మీటర్ తీసివేసి మా మునుపటి విద్యుత్ మీటర్ ఇప్పించ వలసిందిగా కోరుతున్నామన్నారు.

## ఎమ్మెల్యే రాజప్పను మర్యాదపూర్వకంగా కలిసిన వ్యవసాయ మార్కెట్ కమిటి సెక్రటరీ



పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటి సెక్రటరీగా డి.శ్రీనివాస్ సాధారణ బదిలీలలో భాగంగా పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటి సెక్రటరీగా రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్పను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.వీరితో పాటు ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నూనె రామారావు తదితరులు ఉన్నారు.

## అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు ధరఖాస్తుకు అవకాశం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో అనధికార లేఅవుట్‌లలోని ప్లాట్లు మరియు అనధికార స్థలములు కొనుగోలు చేసిన వాటికి 26-7-2025 నుండి 90 రోజులలో పెద్దాపురం పురపాలక సంఘం నందు ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్ నందు ధరఖాస్తు చేసుకోవలసినదిగా మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ జిఓఎంఎస్ నెం.134 ద్వారా అనధికార లేఅవుట్లు మరియు ప్లాట్లు క్రమబద్దీకరణ రూల్స్ 2020ను సవరణ చేస్తూ ఆర్డర్ జారీ చేయడం జరిగిందని, కావున పురపాలక సంఘంలోని ది.30-06-2025కి ముందు ఎవరైన అనధికార లేఅవుట్‌లో ప్లాట్లు మరియు అనధికార స్థలములు కొనుగోలు చేసి ఉంటే ధరఖాస్తు చేసుకొనవలసినదిగా ఆయన తెలిపారు. ఈ ధరఖాస్తులను జిఓ ప్రకారం పరిశీలించి, ఫీనలైజేషన్ చార్జిలు మరియు సదరు స్థలముకు 14శాతం మార్కెట్ వాల్యూ (ప్రస్తుతం ది.30-06-2025) ప్రకారం చార్జీలు చెల్లించిన స్థలమును క్రమబద్దీకరణ చేయుటకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని పుర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ తెలిపారు.

# ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం







కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్య వాతావరణంలో మానవ మనుగడ కొనసాగించడానికి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. మానవులు చేస్తున్న స్వయంకృత అనర్థాల వల్ల ప్రకృతి వైపరీత్యాలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రకృతిలో సహజంగా లభించే వనరుల మీద ఆధారపడాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ ప్రజలు మరియు మొక్కల అనుసంధానం, వన్యప్రాణుల సంరక్షణలో డిజిటల్ ఆవిష్కరణలను అన్వేషించడం అనే థీమ్‌తో ఈరోజు ప్రపంచ ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నాం. ఈ కార్యక్రమానికి డాక్టర్ సారా ఎమ్మెస్సీ, బిఈడీ, పిహెచ్‌డి, బోటనీ లెక్చరర్ అతిథిగా విచ్చేసి జీవ వైవిధ్యాన్ని రక్షించడం మరియు పరిరక్షించడం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సారా మాట్లాడుతూ అంతరించిపోతున్న మొక్కలు వివిధ రకాల జంతువుల గురించి వివరించారు శేషాచలం కొండల్లో మాత్రమే ఉన్న అరుదైన మొక్క జాతులను గురించి వాటిని పరిరక్షించే విధానాలను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ద్వారా విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందని నిరంతరం వాటిని గుర్తుపెట్టుకుని నిజ జీవితంలో పాటించవలసిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖ దేవి, కె.నవ్య, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.సత్యవతి, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ధరల పర్యవేక్షణ కమిటీ ప్రాథమిక అవసరాల వస్తువుల ధరలను పర్యవేక్షించాలి

**– జాయింట్ కలెక్టర్, కమిటీ చైర్మన్ నిషాంతి**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ధరల పర్యవేక్షణ కమిటీ ప్రాథమిక అవసరాల వస్తువుల ధరల ను పర్యవేక్షించి నియంత్రణలో ఉంచడంలో కీలకంగా వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు కమిటీ చైర్మన్ టి.నిషాంతి అన్నారు. సోమవారం స్థానిక పిజిఆర్ఎస్‌లో జిల్లాస్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ పనితీరుపై ఆమె కమిటీ సభ్యులతో సమీక్షించి, మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల రాష్ట్రస్థాయి బృందం పర్యటించి ప్రాథమికంగా అవసరమైన నిత్యావసరాలు ధరల నియంత్రణలో కమిటీ సంతృప్తికరంగా పనిచేస్తున్నట్లు వెల్లడించిందన్నారు. జిల్లాస్థాయి ధరల పర్యవే క్షణ కమిటీ ప్రధాన ఉద్దేశ్యం జిల్లాలో ప్రాథమిక అవసరాల వస్తువుల ధరలను పర్యవేక్షిస్తూ ప్రజలకు సరసమైన న్యాయమైన ధరలకే వస్తువులు అందుబాటులో ఉండేలా చూడడంలో కీలక భూమిక పోషిస్తోందన్నారు.అత్యవసర వస్తువుల ధరల పర్యవేక్షణ, బియ్యం, పప్పులు, చక్కెర, నూనె వంటి ప్రాథమిక వస్తువుల ధరలను కమిటీ ధరలు నియంత్రణలో ఉండేటట్లు పర్యవేక్షించాలన్నారు ధరల పెరిగిన సందర్భాల్లో కృత్రిమ కొరత వంటి కారణాలను విశ్లేషించి నియంత్రణ చర్యలు బలోపేతం చేయాలన్నారు. వాణిజ్య శాఖకు నివేదిక పంపించి ప్రభుత్వానికి ధరల సమాచారం పంపడం జరుగుతుందన్నారు. నకిలీ సరుకులు నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడంలో కమిటీ ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజలందరికీ ప్రాథమిక అవసరాలు అందుబాటులో ఉండేలా కమిటీ పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా చేపట్టి జిల్లాను ప్రథమ శ్రేణిలో నిలపాలని ఆమె కమిటీ సభ్యులకు సూచించారు.సరఫరా డిమాండ్ మధ్య సమతౌల్యం సాధించడంలో ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ధరల నియంత్రణతోపాటుగా ప్రజలకు నాణ్యమైన కూరగాయలు, ఇతర సరుకులను బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరలకే రైతుబజార్లలో విక్రయించాలని, రైతు బజార్, మార్కెట్ కమిటీ ఆవరణలోను, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు అమ్మకాలపై కమిటీ ధరల పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, మార్కెట్ కమిటీ ఏడి కే.విశాలాక్షి, తూనికలు కొలతలు నియంత్రణ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జెసి చిన్న రాముడు



**గోకవరం, మేజర్ న్యూస్ :** సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ కళాశాల (గిరిజన సంక్షేమ) బాలుర వసతి గృహాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. విద్యార్థులకి అందచేస్తున్న మెనూ ను పరిశీలించడం జరిగింది. విద్యార్థులకి అందచేస్తున్న మెనూను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ విషయంలో ఎటువంటి ఫిర్యాదులు లేకుండా సక్రమంగా నిర్వహించడం పై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. అంతకు ముందు స్థానిక ఎంపిడివో కార్యాలయం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూరగాయల, ఆకుకూరల స్టాల్ ను పరిశీలించారు. రైతులు పండించిన ఉత్పత్తులు మాత్రమే ప్రదర్శించాలని స్పష్టం చేశారు.

# తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం సమర్ధవంతంగా అమలు చేయాలి



– జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం, మేజర్ న్యూస్ :** తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 సమర్ధవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన పీజీఆర్ఎస్ లో మాట్లా డుతూ భారతీయ సాంప్రదాయ కుటుంబ వ్యవస్థలో పూర్వం పెద్దలే నిర్ణయాత్మక శక్తులుగా ఉండి నిర్ణయాలు తీసుకునేవారని, ఉమ్మడి కుటుంబాలు విచ్చిన్నమై చిన్న చిన్న కుటుంబాలుగా మారడం, తరువాతి తరాలకు పెద్దవారితో సాన్నిహిత్యం లోపించడంతో పిల్లలకు పెద్దల ప్రాధాన్యత ఏమిటో తెలియకపోవడంతో చాలామంది వృద్ధులు తమ పిల్లల నిరాధారణకు, నిర్లక్ష్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో ఒంటరితనంతో ఎన్నో అవమానాలను భరిస్తూ తమ అవసరాలను తీర్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. వీరిలో కొందరు జీవిత భాగస్వామిని కోల్పోయినవారు, పిల్లలు లేని పరిస్థితి, ఇలా రకర కాలుగా ఆదరణకు నోచుకోకుండా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ సంక్షేమ చట్టం పెద్దల హక్కులను చట్ట ప్రకారం కాపాడుతుందన్నారు. భారత పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన కొన్ని ప్రాథమిక హక్కులు ఉన్నాయని, అందుకు వయోవృద్ధులు మినహాయింపు కాదన్నారు. వికలాంగులు, సీనియర్ సిటిజెన్ల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించి ఈ యొక్క చట్టం గురించి తెలియజేయాల్సి ఉందన్నారు. ఆ దిశగా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. సమాజంలో వయోవృద్ధుల సంఖ్య 30 శాతానికి పెరుగుతుందన్న ఐక్యరాజ్య సమితి సూచనల మేరకు వయోవృద్ధుల పట్ల పోషణ ఆలన పాలన ఒక ఛాలెంజ్‌గా తీసుకొని ప్రభుత్వం ఈ యొక్క చట్టాన్ని రూపొందించిందన్నారు. 60 సంవత్సరాలు దాటినవారి భద్రతకోసంఈచట్టం రూపొందించబడిం దన్నారు. ఆస్తి, సంపాదన లేని వృద్ధులకు రక్షణ కల్పించడానికి డివిజన్ జిల్లా స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కమిటీలను నియమించాలని ఆదేశించిందన్నారు. నిర్వహణ అధికారిగా సహాయ సంచాలకులు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లేదా తత్సమాన అధికారిని నియమించాలని చట్టం సూచిస్తుంది అన్నారు. సెక్షన్ 19 ప్రకారం ప్రతి జిల్లాకు ఒక వృద్ధా శ్రమాన్ని ప్రభుత్వ పరంగా నెలకొల్పాలని, ఈ వృద్ధాశ్రమంలో కనీసం 150 మంది వృద్ధులు, అనాథలు పిల్లలు, నిరాదరణ గురైన తల్లిదండ్రులు ఉండేలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, తల్లిదండ్రుల సంరక్షణ, పిల్లలు లేదా వారసులు తల్లిదండ్రుల పట్ల ఆర్థిక సంరక్షణ సహాయం ఇవ్వకపోతే, తల్లి/తండ్రి సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ వద్ద ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ప్రతి జిల్లా డివిజన్ మండలంలో ప్రభుత్వం మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తుందన్నారు. దీని ద్వారా నెలవారీగా సంరక్షణ ఖర్చు రూ.10,000 వరకు చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజనుల సంక్షేమ అధికారి శ్రీనివాసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు మత్స్యకారుని మరణం



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** ధవళేశ్వరం గ్రామం నందు జాలరి పేటకు చెందిన సవదల సత్యారావు (43) కుటుంబ పోషణ నిమిత్తం కోసం ప్రతిరోజు చేపల వేటకు వెళ్లి చేపల వేట ఆడుతూ ఉంటారు. 28.07.2025వ తేదీన తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో ఇంటి వద్ద నుండి వల తీసుకొని బయలుదేరి ధవళేశ్వరం బ్యారేజీ దగ్గరలో చేపల వేటకు వెళ్లి బ్యారేజ్ దిగున గల కవర్ స్లూయిజ్ వద్ద చేపల వేటాడుతు ప్రమాదవశాత్తు గోదారిలో పడి చనిపోయినారు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.సత్యారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సి.ఐ. టి.గణేష్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఆగస్టు 12న రామచంద్రపురంలో కోనసీమ యూత్ మీట్



– యువత సమాజం పట్ల సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

– యువత దేశ భవిష్యత్తు.. సమాజానికి చైతన్యం

– రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్ :** యువత దేశానికి వెన్నెముక అని, వారిని సక్రమమైన మార్గంలో నడిపిస్తే దేశ భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తారని రాష్ట్ర కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రామచంద్రపురంలో " కోనసీమ యూత్ మీట్" పేరుతో నిర్వహించే కార్యక్రమ గోడపత్రికను సోమవారం సాయంత్రం మంత్రి సుభాష్ యువత సమక్షంలో ఆవిష్కరించారు. రామచంద్రపురం లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువతను ఉద్దేశించి మంత్రి సుభాష్ మాట్లాడారు. యువతలో దాగివున్న ప్రతిభను బయటకు తీసుకొచ్చి, వారిలో నాయకత్వ లక్షణాలు నింపేందుకు, సమాజం పట్ల సామాజిక బాధ్యత కలిగి వ్యవహరించేందుకు గాను ఆగస్టు 12న రామచంద్రపురంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న విజయ్ ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు పెద్ద ఎత్తున కోనసీమ యూత్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ భవిష్యత్తులో యువతదే కీలక పాత్ర అని, యువత తమలోని శక్తిని గుర్తించి వారి కలలను సాకారం చేసే దిశగా కోనసీమ యూత్ మీట్ ఉంటుందన్నారు. అన్ని రంగాల్లోనూ యువత కీలకపాత్ర పోషిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి సుభాష్ ఈసందర్భంగా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పలు పోటీలు కూడా నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని యువతను మేల్కొలిపి వారిలో చైతన్యం నింపేందుకు, వారి భావి జీవితానికి దిశా నిర్దేశం చేసేందుకు కోనసీమ యూత్ మీట్ దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లాలోని యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు.

## ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన బిజినెస్ స్కూల్ విద్యార్థులు



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** సూరంపాలెం ఆదిత్య స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు ప్రకృతి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల డీన్ డా రవి తంగజం, అసిస్టెంట్ డీన్ డా. బి. సౌజన్య మరియు ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ బి.కామేశ్వర శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీన్ మరియు అసిస్టెంట్ డీన్ మాట్లాడుతూ "ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడమే కాక, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన జీవన వాతావరణాన్ని అందించవచ్చు," అని అన్నారు. విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు కూడా పాల్గొన్నారు.

## వెంకన్న సన్నిధిలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓఎస్‌డి వెంకటకృష్ణ



**ఆత్రేయపురం మేజర్ న్యూస్** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓఎస్‌డి కె.వెంకటకృష్ణ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం వేదాశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం అందించారు. ఆయన వెంట జిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు కరటూరి నరసింహారావు, ఎంపిడీఓ బి.వెంకట రామన్ తదితరులు ఉన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

– నలజాల మధు



**ఎటపాక, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంతో గ్రామాల అభివృద్ధి చెందుతాయి అని తెలుగు యువత మండల అధ్యక్షులు నలజాల మధు అన్నారు. సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల కాలనీ గ్రామంలో తెలుగు యువత మండల అధ్యక్షులు నలజాల మధు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగింది అని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్‌కు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు అని, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పెరలా వెంకన్న, బీసీ సెల్ అధ్యక్షులు సురేష్ గౌడ్, బీసీ సెల్ కార్యదర్శి రూప లక్ష్మి, 275 బూత్ ఇంచార్జి నరేష్ గౌడ్, టీడీపీ నాయకులు మంద నరసింహారావు, నడిపింటి వెంకన్న, పల్లెల పాపారాయుడు, దానిశెట్టి సత్యనారాయణ, సాయిలు బాబు, ముక్కు కిరణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.